# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025






**టీఎల్ఎంతో సులభంగా..**

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు టీఎల్ఎంను వినియోగిస్తే బోధన సులభం కానుంది. 8లో



**గందరగోళంగా ఓట్ల లెక్కింపు**

కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ఎన్నికల ఓట్ల లెక్కింపు గందరగోళంగా మారింది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 31° / 25°

**వాతావరణం**

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువు దీరిన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి గురువారం అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆ తర్వాత హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, అర్చకులు, వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

**శరన్నవరాత్రుల ప్రచార రథం ప్రారంభం..**

పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల విజయంతానికి ప్రత్యేక రథం ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ రథాన్ని పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో చెవుగాని పాపారావు, పెండ్లి రామిరెడ్డి, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### 22 నుంచి డీఎల్ఈడీ థియరీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 22 నుంచి 27 వరకు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి బి.నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని, చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని వివరించారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 8919279238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### జాతీయ స్థాయి టోర్నీకి ఉపాధ్యాయుడి ఎంపిక



ఆంజనేయులు

దుమ్ముగూడెం : మండలంలోని ఆర్లగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు శ్యామల ఆంజనేయులు ఆలిండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన షటిల్ విభాగంలో అండర్ – 40 విభాగంలో ఆయన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఆంజనేయులును గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కారం సర్వేష్, పూనెం నర్సింహారావు తదితరులు అభినందించారు.

### 'ఆది కర్మయోగి' వివరాలు సమర్పించాలి

భద్రాచలంఅర్బన్ : ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన వివరాలు, ప్రతిపాదనలు పంపించాలని ఏటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఐటీడీఏ కార్యాలయం నుంచి 19 మండలాల అధికారులు, నోడల్ అధికారులు, జిల్లా, మండల లెవెల్ మాస్టర్ ట్రైనింగ్ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో 19 మండలాల పరిధిలోని 130 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ పథకంపై ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన ఎలా ఉందనే వివరాలతో నివేదికలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి రాంబాబు, లక్ష్మీనారాయణ, జేడీఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు సేవలకు సై!

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషాలిటీ వైద్య చికిత్సలు**

- ఉచితంగా రోగనిర్ధారణ పరీక్షలు, ఆపరేషన్లు
- జిల్లా నలువైపులా అందుబాటులో రక్త నిల్వ కేంద్రాలు
- సర్కారు దవాఖానాలపై పెరుగుతున్న నమ్మకం






ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి, వైద్య సేవల కోసం వేచి ఉన్న జనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. సర్కారు దవాఖానాల్లో వైద్యుల పోస్టులు భర్తీ చేయడం, రోగ నిర్ధారణ పరీక్షలు, శస్త్ర చికిత్సలు ఉచితంగా అందిస్తుండడంతో ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుండగా, పేషెంట్ల తాకిడి పెరుగుతోంది. వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదవుతున్న ఐపీ, ఓపీ రికార్డులే అందుకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. చర్ల సామాజిక ఆస్పత్రిలో నిన్నామొన్నటి వరకు 50 మంది వరకు ఓపీ రికార్డు ఉండగా ఇప్పుడది 220కి పెరిగింది. మణుగూరు ఏరియా ఆస్పత్రిలో ఈ ఏడాది జనవరిలో ఎనిమిది ప్రసవాలు మాత్రమే జరగగా, ఆగస్టు నాటికి ఆ సంఖ్య 100 దాటింది. గోదావరి తీరానికి రెండువైపులా ఉన్న ఆస్పత్రుల్లో గైనకాలజిస్ట్ సేవలు అందుబాటులోకి రావడంతో ఏజెన్సీ వాసులకు మెరుగైన వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయి. అశ్వారావుపేట ఏజెన్సీలోనూ ఇదే తరహా సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. దీంతో ఏజెన్సీలో ఆర్‌ఎంపీల దూకుడుకు బ్రేకులు పడుతున్నాయి.

**శస్త్ర చికిత్సలూ అదే స్థాయిలో..**

సాధారణ వైద్య సేవలకు తోడు ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలు సైతం పెరిగాయి. భద్రాచలం ఆస్పత్రిలో ప్రతీ నెల సగటున 14 మందికి కంటి ఆపరేషన్లు చేస్తున్నారు. పాల్వంచ, భద్రాచలం ఆస్పత్రుల్లో ఎముకలకు (ఆర్థోపెడిక్) సంబంధించి నెలకు 50 వరకు ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఇక్కడ కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు కూడా ప్రారంభించారు. ఇల్లెందు ఆస్పత్రిలో ఫిజియోథెరపీ చికిత్స విజయవంతంగా నడుస్తోంది. ఇక్కడ నెలకు 200 మందికి పైగా ఫిజియోథెరపీ సేవలు పొందుతున్నారు. దంత విభాగంలోనూ జిల్లా వ్యాప్తంగా ప్రతీ నెల 300 పైగా శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్పెషాలిటీ సేవలు మెరుగవడంతో ఇక్కడ అందే వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. ఉదాహరణకు ఇల్లెందు ఆస్పత్రిని పరిశీలిస్తే ఇక్కడ 100 పడకలు ఉండగా గత నాలుగైదు నెలలుగా 120 మందికి పైగా ఇన్ పేషెంట్లు(ఐపీ) ఉంటున్నారు. దీంతో ఇక్కడ కొత్తగా ఆపరేషన్ థియేటర్ నిర్మాణానికి స్థలం దొరకని పరిస్థితి నెలకొంది.

**రక్త నిల్వ కేంద్రాలు**

గతంలో జిల్లాలో ఎక్కడ రక్తం అవసరమైనా కొత్తగూడెం, భద్రాచలం ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. ఇప్పుడు కొత్తగా మణుగూరు, అశ్వారావుపేటలోనూ రక్త నిల్వ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. త్వరలో ఇల్లెందులోనూ ప్రారంభం కానుంది. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో కలిపి డయాలసిస్ కోసం 54 మిషన్లు అందుబాటులో ఉండగా 400 మందికి డయాలసిస్ చేసే వీలుంది. కాగా ప్రస్తుతం రోగుల సంఖ్య 350 లోపే ఉంది. అయితే స్పెషాలిటీ సేవలు అందించే వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో డాక్టర్ల సంఖ్య మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ అనూహ్యంగా డిమాండ్‌కు సరిపడా నర్సులు లేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికిప్పుడు జిల్లా వ్యాప్తంగా 90 మంది నర్సుల అవసరం ఉంది. మరోవైపు ఆస్పత్రుల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, డాక్టర్లకు సైతం గత నాలుగు నెలల నుంచి వేతనాలు అందడం లేదు.

**అభివృద్ధి నిధుల జాడేది..?**

రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సబ్ సెంటర్ల నుంచి ఏరియా ఆస్పత్రుల వరకు వైద్య సిబ్బంది అహర్నిశలూ ప్రయత్నిస్తున్నారు. అయితే వీటికి అందాల్సిన ఆస్పత్రి అభివృద్ధి నిధులు(హెచ్‌డీఎఫ్) రెండు, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ నిధులు అందుబాటులో ఉంటే ఆస్పత్రుల్లో అవసరమైన అత్యవసర మందుల కొనుగోలు, చిన్న చిన్న మరమ్మతులు చేయించే అవకాశం ఉంటుంది. ఏళ్లుగా హెచ్‌డీఎఫ్ నిధులు లేక ప్రతీ పనికి కలెక్టర్ అందించే ప్రత్యేక నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

**నలువైపులా స్పెషాలిటీ సేవలు**



ఏజెన్సీ జిల్లాల్లో గతంలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి కావు. ఏ జబ్బు చేసినా ఖమ్మం, కొత్తగూడెంపైనే ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రభుత్వ పరంగా అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం.

– జి.రవిబాబు, డీసీహెచ్‌ఎస్

**మూడు రోజులుగా ఆస్పత్రిలోనే ఉంటున్నా..**



మూడు రోజులు క్రితం జ్వరం రావడంతో ఇల్లెందు ఆస్పత్రికి వచ్చా. పెద్ద డాక్టర్లు పరీక్షించి బెడ్ ఇచ్చారు. ఇప్పుడు జ్వరం తగ్గుముఖం పట్టింది. రోజూ గ్లూకోజ్ పెట్టి ఇంజెక్షన్లు వేస్తున్నారు. ప్రైవేట్‌లో అయితే రూ.10వేలకు పైగా ఖర్చయ్యేది. ఇక్కడ రూపాయి ఖర్చులేకుండా రోగం నయం చేస్తున్నారు.

– సీహెచ్ విజయ, రేపల్లెవాడ, ఇల్లెందు మండలం

## అమరుల త్యాగాలు మరువలేనివి

- సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- హాజరైన ఎస్పీ రోహిత్‌రాజ్, డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్



సెంట్రల్ పార్క్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌ఓ

చుంచుపల్లి: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ అమరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. అటవీ అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ పార్కులో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గొత్తికోయల చేతిలో హత్యకు గురైన ఎఫ్‌ఆర్‌ఓ చలమల శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అడవులు వనరులు మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు ప్రాణవాయువుగా నిలుస్తాయని చెప్పారు. అడవుల సంరక్షణలో ఉద్యోగుల కృషి ఎనలేనిదని అన్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేస్తున్నారని అభినందించారు. ఎస్పీ రోహిత్‌రాజ్ మాట్లాడుతూ అటవీ సిబ్బందికి ఎదురవుతున్న సవాళ్ల విషయంలో పోలీస్ శాఖ అండగా నిలుస్తుందని తెలిపారు. అటవీ సిబ్బంది నిత్యం ప్రమాదాలు ఎదుర్కొంటూ అడవులను కాపాడుతున్నారని అన్నారు. డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్ మాట్లాడుతూ అమరుల త్యాగాలు తమకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. అంతకుముందు ప్రకాశం స్టేడియం నుంచి సెంట్రల్ పార్కు వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు కుటుంబసభ్యులు, వివిధ విభాగాల అటవీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సెంట్రల్ మెడికల్ స్టోర్ తనిఖీ**

రామవరం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోగులకు అవసరమయ్యే ఔషధాలు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, ప్రధాన రహదారి నుంచి స్టోర్‌కు వచ్చే రోడ్డు మరమ్మతు చేయాలని, స్టోర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మందుల నిల్వకు ర్యాక్‌లు, బరువైన బాక్సులు ఎత్తడానికి అవసరమైన యంత్రాలు సమకూర్చాలని సిబ్బంది కోరగా త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట సీనియర్ ఫార్మసీ అధికారి శారద, ఫార్మసిస్ట్ రామచందర్ ఉన్నారు.

## దళిత బంధు యూనిట్ల తనిఖీ



జూలూరుపాడులో దళిత బంధు యూనిట్‌ను పరిశీలిస్తున్న ప్రీతమ్

జూలూరుపాడు: మండల కేంద్రంలో గతంలో మంజూరైన దళిత బంధు యూనిట్లను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరగిరి ప్రీతమ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని అడ్డగోలుగా ఇచ్చిందని, కొందరు లబ్ధిదారులు యూనిట్లను అమ్ముకున్నారని తెలిపారు. అలాంటి యూనిట్లను గుర్తించేందుకే తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం పలు పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, దళిత బంధు లబ్ధిదారుడు మోదుగు రామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్, నాయకులు గోపు రామకృష్ణ, పోతురాజు నాగరాజు, మెంతుల కృష్ణ పాల్గొన్నారు.

**రామయ్యను దర్శించుకున్న ప్రీతమ్..**

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో పూజల అనంతరం వేదాశీర్వచనం చేసి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. అనంతరం టూరిజం శాఖ హోటల్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అటవీ శాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రీతమ్‌కు ఘన సన్మానం**

సుజాతనగర్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రీతమ్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమములో ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పతి కుమార్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బొందయ్య, నాయకులు గద్దల రమేష్ పాల్గొన్నారు.

# వేతన వెతలు..

- 'ఆశ్రమ' వంట కార్మికులకు ఆరు నెలలుగా జీతాల్లేక ఇక్కట్లు
- గుదిబండగా మారనున్న జీఓ 64
- ఉమ్మడి జిల్లాలో 490 మంది డైలీవేజ్ వర్కర్లు
- సమస్యల పరిష్కారానికి నేటి నుంచి సమ్మెబాట



ప్రజా భవన్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు(ఫైల్)

కరకగూడెం: ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులు గత ఆరు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీఓ 64.. వారికి గుదిబండగా మారింది. దీంతో తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 60 ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న 490 మంది డైలీ వేజ్ కార్మికులు శుక్రవారం నుంచి సమ్మె బాట పట్టనున్నారు.

**అసలే అరకొర.. అందులోనూ జాప్యం**

ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న వంట కార్మికులకు చెల్లించే అరకొర వేతనాలు కూడా నెలల తరబడి పెండింగ్ ఉంటున్నాయి. దీంతో నిత్యావసరాలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 64 అమల్లోకి వస్తే తమ వేతనం సగానికి సగం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈజీఓ అమలైతే.. ప్రస్తుతం నెలకు రూ.26వేలు పొందే కార్మికుడి వేతనం.. రూ.11,700కు పడిపోవచ్చని తెలుస్తోంది. ఈ జీఓ అమలు చేయొద్దని, తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద కార్మికులు, ఆయా సంఘాల నాయకులు భారీ ఆందోళన చేసి, మంత్రి అట్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. పాత వేతన విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో చేపట్టిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు శుక్రవారం నుంచి సమ్మె బాట పట్టేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు ఐటీడీఏ అధికారులకు సమ్మె నోటీసు అందించారు. ఈ విషయమై ఐటీడీఏ డీడీ మణెమ్మను వివరణ కోరగా వేతనాలు చెల్లించడానికి నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ, కొత్త జీఓ ప్రకారం తీసుకునేందుకు కార్మికులు అంగీకరించడం లేదని తెలిపారు.

**ప్రభుత్వం మా గోడు వినాలి**



ఆరు నెలలుగా జీతాలు లేవు. ఈ జీతంపైనే మా కుటుంబం ఆధారపడి ఉంది. ఎండాకాలమైనా, వానాకాలమైనా కష్టపడి విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నాం. ఇప్పుడిచ్చే వేతనాలే అరకొరగా ఉన్నాయి. ఇక కొత్త జీఓతో జీతాలు ఇంకా తగ్గుతాయంటున్నారు. ప్రభుత్వం మా గోడు విని న్యాయం చేయాలి.

– మునలయ్య, డైలీవేజ్ కార్మికుడు, చిరుమళ్ల ఆశ్రమ పాఠశాల

**జీతాలు రాక అప్పుల పాలు**



జీతాలు లేక అప్పుల పాలయ్యాం. ఆరు నెలలుగా జీతం ఆగిపోతే ఎలా బతకాలి. ఇప్పుడిస్తు జీతాలే సరిపోవడం లేదు. ఇక కొత్త జీఓ అమలైతే ఇంకా తగ్గుతాయని అంటున్నారు. పాత జీతాలు ఇవ్వడంతో పాటు కొత్త జీఓ రద్దు చేయాలి.

– కౌసల్య, డైలీవేజ్ కార్మికురాలు, ఎల్చిరెడ్డిపల్లి ఆశ్రమ పాఠశాల

**కార్మికుల పొట్ట కొట్టొద్దు**



గిరిజన ఆశ్రమ పాఠశాలల కార్మికుల కష్టాలు చెప్పలేనివి. ఆరు నెలల వేతనాలు పెండింగ్ ఉండడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆ జీతాలు ఇవ్వకపోగా ప్రభుత్వం కొత్త జీఓ తెచ్చి వారి పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తోంది. కార్మికులకు అన్యాయం జరిగితే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.

–కె.బ్రహ్మచారి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

# ప్రశ్నించడమే నేరమా?

ఏపీలో పౌరహక్కులు, జర్నలిస్టుల స్వేచ్ఛపై ఉక్కుపాదం ● అక్కడి ప్రభుత్వ తీరును తప్పుపడుతున్న పలువురు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పౌరహక్కులు, జర్నలిస్టుల స్వేచ్ఛపై అక్కడ టీడీపీ ఆధ్వర్యాన అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. గడిచిన మే నెలలో 'సాక్షి' తెలుగు దినపత్రిక విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, మంగళగిరి, రాజమండ్రి, ఏలూరు, శ్రీకాకుళం జిల్లా కార్యాలయాలపై టీడీపీ శ్రేణులు మూకదాడులకు దిగాయి. ఈ విషయంలో దోషులను శిక్షించాలని 'సాక్షి' జర్నలిస్టులు పోలీస్‌స్టేషన్లలో లిఖిత పూర్వక ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదు. ఇదే సమయాన ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, మోసాలపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు, కార్మికులు, మహిళలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల పక్షాన వార్తల రూపంలో ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై కొందరు ఉద్యోగులతో ఫిర్యాదులు ఇప్పిస్తూ తక్షణమే కేసులు నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగానే వివిధ అంశాలపై ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏర్పాటుచేసే ప్రెస్ కాన్ఫరెన్స్‌ల వార్తలు రాసిన 'సాక్షి' దినపత్రికతో పాటు ఎడిటర్, ఇతర జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తూ రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను తమ గుప్పిట్లోకి తీసుకునేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని దాడులు, కేసులు, పోలీసుల చేత కార్యాలయాలు, జర్నలిస్టుల ఇళ్లలో తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తోంది. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ, ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతు నొక్కేస్తున్న ఏపీ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై పలువురి స్పందన..

– ఖమ్మం సహకారనగర్


**జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసేలా..**



ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసేలా కుట్ర జరుగుతోంది. జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్కడి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. జర్నలిస్టులను ఏదోలా లోబర్చుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఏపీలో సాక్షిపై, జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయి. ఆధారాలు లేకున్నా సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై అక్కడి ప్రభుత్వం కక్ష సాధింపుగా వ్యవహరించడాన్ని మానుకోవాలి.

– కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి


**కేసులతో నియంత్రించలేరు..**



కేసులతో మీడియాను నియంత్రించలేమనే విషయాన్ని అధికార వర్గాలు గుర్తించాలి. వార్తలు ఇష్టం లేకపోతే పాత్రికేయులపై కేసుల నమోదు కొనసాగుతోంది. అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. నిజాన్ని నిర్భయంగా వెలికితీయడమే మూల సూత్రంగా పనిచేసే మీడియాను ఇబ్బంది పెడితే భవిష్యత్ పరిణామాలు అనుభవించక తప్పదు.

– ఏనుగు వెంకటేశ్వరరావు, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

**మీడియా గొంతు నొక్కడం సరికాదు**



అధికారంలో ఉన్నవారు భావ ప్రకటన స్వేచ్ఛ, మీడియా గొంతు నొక్కడం ప్రజాస్వామ్యంలో తగదు. మీడియా ప్రభుత్వానికి ఏకపక్షంగా అండగా ఉండాలని భావించడం సరికాదు. ప్రెస్‌మీట్ వివరాలతో కథనం ప్రచురించిన ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు నమోదు చేస్తే మీడియా స్వాతంత్య్రం దెబ్బతింటుంది. ఇకనైనా జర్నలిస్టులపై దాడులు ఆపి మీడియా స్వేచ్ఛగా అభిప్రాయాలు ప్రకటించే వాతావరణం కల్పించాలి. – పోటు రంగారావు, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి

**పత్రికా స్వేచ్ఛను కాపాడాలి**



ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర ఎంతో కీలకం. ప్రభుత్వాలు – ప్రజలకు మధ్య వారధిలా పత్రికలు పని చేస్తుంటాయి. అలాంటి పత్రికల్లో వచ్చే కథనాలను జీర్ణించుకోలేక ఎడిటర్లపై ఏపీ ప్రభుత్వం కేసులు నమోదు చేయడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు. తక్షణమే సాక్షి ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డి, జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఏపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

– పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

**జర్నలిస్టుల హక్కులపై ఉక్కుపాదం**



చంద్రబాబు ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తోంది. కక్షగట్టి సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం అన్యాయం. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన జర్నలిజం, జర్నలిస్టుల హక్కుల రక్షణకు పాలకులు పాటుపడాలి. అంతేతప్ప ప్రభుత్వం – ప్రజలకు వారధిగా ఉంటూ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం సరికాదు. ఇలాంటి ఘటనలను ఫాసిస్టు చర్యగా భావిస్తున్నాం.

– ఆకుతోట ఆదినారాయణ, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్), ఖమ్మం జిల్లా అధ్యక్షుడు

## క్లుప్తంగా

### మునగ, వెదురు సాగు లాభదాయకం

డీఆర్‌డీఓ విద్యాచందన



మహిళా రైతులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

ములకలపల్లి: మునగ, వెదురు పంటల సాగు ఎంతో లాభదాయకమని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. మండల పరిధిలోని మూకమామిడి పంచాయతీలో సాగు చేస్తున్న మునగ తోటలను పరిశీలించారు. మహిళా రైతులతో మాట్లాడి, సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో వెదురు సాగు చేస్తున్న మహిళా సమాఖ్య గ్రూపు సభ్యులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. డీపీఎం సమ్మక్క, ఇంచార్జ్ ఎంపీడీఓ రామారావు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### వైకల్యం అధిగమించి ఉన్నతస్థాయికి ఎదగాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్



భవిత సెంటర్‌లో చిన్నారులతో న్యాయమూర్తి రాజేందర్ తదితరులు

కొత్తగూడెంటౌన్: వైకల్యం అధిగమించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎం. రాజేందర్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెం బాబుక్యాంప్‌లోని భవిత సెంటర్‌లో గురువారం ప్రపంచ బధిరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మూగ, చెవిటి పిల్లలకు కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముగ్గురు బధిర పిల్లలకు వినికిడి పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి అంగవైకల్యం అడ్డురాదని, అలాంటి వారిని అందరూ ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వాలు దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జయలక్ష్మి, డిస్ట్రిక్ వేల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత లెనినా, ఎంఈఓ బాలాజీ, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి సిబ్బంది పఫీన్ తదితరులు పాల్గొన్నారు.

### రైతు వేదికల్లోనూ యూరియా విక్రయాలు

డీఏఓ బాబూరావు



రైతు వేదికలో యూరియా విక్రయాలను ప్రారంభిస్తున్న డీఏఓ బాబూరావు

ఇల్లెందురూరల్: యూరియా సరఫరాలో సమస్యతో రైతులు పీఏసీఎస్ విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరకుండా ఇక నుంచి రైతు వేదికల్లోనూ యూరియా అందుబాటులో ఉంచుతామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు తెలిపారు. మండలంలోని సుదిమళ్ల, రేపల్లెవాడ రైతు వేదికల్లో యూరియా విక్రయాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇల్లెందులో ఇప్పటికే మూడు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏడీఏ లాల్‌చంద్, ఏఓ సతీష్, రైతులు పాల్గొన్నారు.

### నేటి నుంచి సింగరేణి వ్యాప్తంగా క్రీడలు

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి వ్యాప్తంగా గురువారం నుంచి క్రీడా పోటీలు ప్రారంభంకానున్నాయి. 2025–26 సంవత్సరానికి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపీఎస్–జీఏ) ఆధ్వర్యంలో అన్ని ఏరియాల్లో క్రీడలు నిర్వహించనున్నారు. కార్పొరేట్ ఏరియాలో 12న ఫుట్‌బాల్ పోటీలతో క్రీడలు ప్రారంభమై, సెప్టెంబర్ 28న సాంస్కృతిక కార్యక్రమాలతో ముగియనున్నాయి. ఇందుకోసం ప్రకాశం స్టేడియం, సీఈఆర్, కేసీఓఏ క్లబ్ సిద్ధమవుతున్నాయి. ఇతర ఏరియాల్లో కూడా క్రీడా మైదానాలు, క్లబ్ భవనాలు వేదికలుగా నిలుస్తున్నాయి. క్రీడా పోటీల సమన్వయానికి అధ్యక్షుడిగా జీ.వీ.కిరణ్ కుమార్ (జీఎం, పర్సనల్ వెల్ఫేర్–సీఎస్ఆర్)తోపాటు మరికొందరు బాధ్యులను నియమించారు. ఏరియా స్థాయి విజేతలను ప్రాంతీయస్థాయి, ఆపై సంస్థ స్థాయి పోటీలకు పంపనున్నారు.

### ఎస్పీని కలిసిన డీఎస్పీ



ఎస్పీకి మొక్క అందజేస్తున్న డీఎస్పీ అశోక్

కొత్తగూడెంటౌన్: ఎస్పీ బి.రోహిత్‌రాజును జిల్లా సైబర్ క్రైమ్స్ కో ఆర్డినేటర్ సెంటర్ డీఎస్పీ బి.అశోక్ మర్యాదపూర్వకంగా కలిశా రు. సీఐగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై గురువారం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీని కలిసి పూల మొక్కను అందజేశారు.

# టీఎల్‌ఎంతో సులభంగా..

**మెరుగుపడనున్న బోధన, అభ్యసన ప్రక్రియ**

- విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి పెంపుదల
- దృశ్య, శ్రవణ అనుభూతితో దీర్ఘకాల జ్ఞాపకం



పార్కలగండిలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో బోధన అభ్యసన సామగ్రితో ఉపాధ్యాయులు(ఫైల్)

దమ్మపేట: టీఎల్‌ఎం(బోధన అభ్యసన సామగ్రి) వినియోగంతో బోధన, అభ్యాసన ప్రక్రియ మెరుగుపడుతుందనే ఉద్దేశంతో ఇటీవల జిల్లా వ్యాప్తంగా మండలాల స్థాయిలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేశారు. ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలకు ఏటీడీఓ స్థాయిలో ఈ నెల 1న పార్కలగండి, ఇతర ప్రాంతాల్లో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ నెల 16న భద్రాచలం గిరిజన భవన్‌లో గిరిజన పాఠశాలలకు జిల్లాస్థాయి మేళా నిర్వహించనున్నారు. ఇతర యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలలకు మండలస్థాయిలో మేళాలు కొనసాగుతున్నాయి. మరో వారంలో వాటికి కూడా జిల్లాస్థాయి మేళా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

**విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా..**

ప్రధానంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పాఠ్యాంశాల బోధనలో టీఎల్‌ఎంను వినియోగిస్తే బోధన సులభతరం అవుతుంది. విద్యార్థుల్లో ఆసక్తి కూడా పెంపొందుతుంది. ఈ క్రమంలో నమూనా చిత్రాలు, మ్యాపులు, బొమ్మలు, చార్టులు, దృశ్య, శ్రవణ పరికరాలతో ఉపాధ్యాయులు బోధన అభ్యసన సామగ్రిని రూపొందించి మేళాలో ప్రదర్శించారు. పార్కలగండి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలకు నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు తయారు చేసిన వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన బోధన అభ్యసన పరికరాలను పరిశీలించి అభినందించారు. టీఎల్‌ఎంను జోడించి బోధించడం ద్వారా విద్యార్థులకు నేర్చుకోవాలని ఆసక్తి పెరగడంతోపాటు దృశ్య అనుభూతి కలుగుతుందని తెలిపారు. టీఎల్‌ఎం తయారీతో ఉపాధ్యాయుల అంతర్గత ప్రతిభ కూడా బయటకు వస్తుందని పేర్కొన్నారు.

**బోధన అభ్యసన సామగ్రి**

బోధన ప్రక్రియను సులభతరం చేసి, విద్యార్థులకు పాఠ్యాంశాల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఉపయోగపడే ప్రతీ వస్తువు, వనరు, పరికరం, సాధనం బోధన అభ్యసన సామగ్రిగా చెప్పవచ్చు. ఈ తరహా బోధనలో ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య జరిగే బోధన అభ్యసన ప్రక్రియ మెరుగుపడుతుంది. వీటి ద్వారా ఉపాధ్యాయుడు బోధనను అత్యంత ప్రభావవంతంగా నిర్వహించవచ్చు. విద్యార్థులు కూడా చురుగ్గా నేర్చుకుంటారు. అభ్యసన ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. సమాచారం ఎక్కువ కాలం గుర్తుంచుకుంటారు. విద్యార్థుల్లో ఆలోచన, విమర్శనాత్మక శక్తి పెరుగుతుంది. దృశ్య, శ్రవణ, దృశ్య–శ్రవణ సాధనాలను టీఎల్‌ఎం బోధనలో ఉపయోగిస్తారు. దృశ్య సాధనాలుగా చిత్రాలు, పోస్టర్లు, నమూనాలు, మ్యాపులు, బొమ్మలను ఉపయోగిస్తారు. శ్రవణ సాధనాలుగా ఆడియో టేపులు, పాటలు, కవితలు, ప్రసంగాలను వినియోగిస్తారు. దృశ్య–శ్రవణ సాధనాలుగా టెలివిజన్లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్, మల్టీమీడియా ప్రజెంటేషన్లను ఉపయోగిస్తారు.



మేళాలో టీఎల్‌ఎం సామగ్రిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్ (ఫైల్)

**టీఎల్‌ఎంతో ప్రయోజనాలు**

- ఉపాధ్యాయుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుంది.
- విద్యార్థులకు అభ్యసన పట్ల సన్నద్ధతతో పాటు కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి కలుగుతుంది.
- ఇంద్రియ అనుభవాల ద్వారా ప్రత్యక్ష అనుభూతి కలుగుతుంది.
- దృశ్య, శ్రవణ పరికరాల ద్వారా నేర్చుకున్న పాఠ్యాంశాలు ఎక్కువ కాలం గుర్తుంటాయి.
- తరగతి గదిలో అభ్యసన వాతావరణం మెరుగుపడుతుంది.
- కష్టతరమైన పాఠ్యాంశాలు నేర్చుకోవడం సులభతరం అవుతుంది.
- వాస్తవ ప్రపంచ పరిచయం, సమస్యల పరిష్కారం, ఆలోచనా శక్తి పెంపొందుతుంది.
- చదువులో వినోదాన్ని, ఆచరణాత్మకతను, అనుభూతిని కలిగిస్తుంది.

**ఆసక్తి, అవగాహన పెరుగుతుంది**



పాఠ్యాంశాల బోధనలో బోధన అభ్యసన సామగ్రిని ఉపయోగిస్తే విద్యార్థులకు పాఠ్యాంశాల పట్ల ఆసక్తితోపాటు అవగాహన పెరుగుతుంది. బోధనలో దృశ్య, శ్రవణ సాధనాల వినియోగం వల్ల ప్రత్యక్ష అనుభూతి పెరిగి, కష్టతరమైన పాఠ్యాంశాలు కూడా సులభంగా అర్థమవుతాయి. టీచర్ల బోధన కూడా మెరుగుపడుతుంది.

– కీసర లక్ష్మి, ఎంఈఓ, దమ్మపేట

**బోధనకు అనుకూలం**



టీఎల్‌ఎం ద్వారా తరగతి గదిలో బోధనకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. విద్యార్థులు పాఠ్యాంశాలు నేర్చుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తారు. విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు, సమగ్ర అభ్యసన సామర్థ్యాలు పెరుగుతాయి. అవగాహన, ఇంద్రియ అనుభవంతో నేర్చుకోవడం వల్ల పాఠ్యాంశాలు దీర్ఘకాలం గుర్తుంటాయి.

– విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు, మొద్దులగూడెం గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల

# గందరగోళంగా 'కేటీపీఎస్' ఓట్ల లెక్కింపు

**ఫలితాల కోసం పడిగాపులు కాసిన ఉద్యోగులు, అభ్యర్థులు**



విజయోత్సవాలు నిర్వహిస్తున్న ఉద్యోగులు

పాల్వంచ: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ (పాల్వంచ) ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ గందరగోళంగా మారింది. బుధవారం కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్‌ల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించారు. సాయంత్రం వైటీపీఎస్, బీటీపీఎస్ నుంచి పోలింగ్ బాక్స్‌లను పాల్వంచకు తీసుకొచ్చారు. ఎన్నికల అధికారి గంగాధర్ ఆధ్వర్యంలో డీఏవీ పాఠశాలలో బుధవారం రాత్రి 9 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. గురువారం రాత్రి వరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఫలితాల కోసం అభ్యర్థులు, ఉద్యోగులు కౌంటింగ్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఫలితాల్లో వెల్లడిలో తీవ్ర జాప్యం కావడం విమర్శలకు దారి తీసింది. తొలుత పోలిగ్ బాక్స్‌ల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టారని, అది ఎటూ తేలకపోవడంతో ఆ తర్వాత అన్ని బాక్స్‌లను ఒక్కచోట కలిపి మళ్లీ లెక్కింపు చేపడుతున్నారని పలువురు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సైతం ఉదయం ప్రారంభమై మధ్యాహ్నం వరకు వెల్లడవుతుండగా కేటీపీఎస్ సొసైటీ ఫలితాలు మాత్రం 24 గంటలపాటు లెక్కించినా తేలలేదు. మొత్తం 2,996 ఓట్లకుగాను 2,543 ఓట్లు పోలుకాగా, ఆ ఓట్లను లెక్కించేందుకు అధికారులు హైరానా పడుతున్నారు.

**ఆరుగురు డైరెక్టర్ల గెలుపు**

ఎస్సీ మెన్ కేటగిరీలో వల్లమల్ల ప్రకాష్ 237 ఓట్లతో సొసైటీ డైరెక్టర్‌గా గెలుపొందినట్లు అధికారులు వెల్లడించారు. కేశులాల్, తోట అనిల్‌కుమార్, కోన నాగేశ్వరరావు, ఆర్. స్పందన, వీరస్వామి డైరెక్టర్లుగా విజయం సాధించారు. రాత్రి 10 గంటలు దాటినా మరో ఏడుగురి డైరెక్టర్ల ఫలితాలు వెల్లడికాలేదు. కాగా విజేతలు, వారి మద్దతుదారులు రంగులు చల్లుకుని విజయోత్సవాలు నిర్వహించారు.

# సమస్యలు పరిష్కరించని ప్రభుత్వం

**బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు**



మాట్లాడుతున్న కాంతారావు

కరకగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లవుతున్నా ప్రజా సమస్యలు పరిష్కారం కావడంలేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. కరకగూడెంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తిరోగమనంలోకి వెళ్తోందని విమర్శించారు. మండలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన వట్టివాగు ప్రాజెక్టును రద్దు చేశారని ఆరోపించారు. కొత్త టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించి మూన్నాళ్ల ముచ్చటగా వదిలేశారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, నాయకులు ఊకే రామనాథం, అక్కిరెడ్డి వెంకటరెడ్డి, బుడగం రాము, రంజిత్ కుమార్, చిరంజీవి, రాంబాబు, కృష్ణ, ప్రసాద్, వేణు, ప్రభాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

# ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలం డిపో టిమ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు తగ్గించిన మస్టర్లను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యాన కార్మికులు గురువారం ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మొదటి షిఫ్ట్‌లో రీజియన్‌లోని అన్ని డిపోల్లో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఖమ్మం డిపోలో జరిగిన నిరసనలో జేఏసీ నాయకులు పిట్టల సుధాకర్, బూదాటి శ్రీనివాసరెడ్డి, నిమ్మటూరి సత్యం, బత్తినేని హనుమంతరావు, పగిళ్లపల్లి నరసింహారావు, గుగ్గిళ్ల రోశయ్య, బేతంపూడి బుచ్చిబాబు, నర్సింహాచారి, పద్మా, జ్యోతి, సంధ్యారాణి, ఉమారాణి, నాగవీర, భాస్కర్, లాల్‌బీ తదితరులు పాల్గొన్నారు.


# నేడు స్ట్రక్చరల్ సమావేశం

**సింగరేణి లాభాల వాటాపై చర్చించే అవకాశం**

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యలపై ఈ నెల 12న హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో సింగరేణి యాజమాన్యం 2024–25 ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల్లో కార్మికులకు చెల్లించే వాటాపై చర్చించనున్నారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్, మెడికల్ బోర్డ్ వంటి అంశాలు కూడా చర్చకు రానున్నాయి. సింగరేణి సంస్థ 2023–24లో 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, రూ.2,412 కోట్ల నికర లాభం ఆర్జించింది. కార్మికులకు 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లు పంపిణీ చేసింది. ఈసారి లాభాల వాటాను 35 శాతానికి పెంచాలని గుర్తింపు కార్మిక సంఘం పట్టుబట్టినట్లు తెలిసింది. శుక్రవారం జరిగే సమావేశంలో ఒప్పందం కుదిరితే రానున్న 10 రోజుల్లో లాభాలా వాటా, చెల్లింపు తేదీనీ ప్రకటించే అవకాశం ఉంది. దసరా పండుగకు పది రోజులు ముందే లాభాల వాటా చెల్లించటం ఆనవాయితీ. అక్టోబర్ 2న దసరా పండుగ జరుపుకోనుండగా పది రోజుల్లో లాభాల వాటా అకౌంట్లలో జమ అవుతుందని కార్మికులు ఎదురు చూస్తున్నారు. కాగా 1998 నుంచి సింగరేణి యాజమాన్యం కార్మికులకు లాభాల వాటా చెల్లిస్తోంది. మొదటిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10 శాతం వాటా చెల్లించారు.

# మట్టి ట్రాక్టర్ల అడ్డగింత

- పట్టుకుని అధికారులకు అప్పగించిన గ్రామస్తులు
- జేసీబీ, మూడు ట్రాక్టర్లను తప్పించిన అక్రమార్కులు!



మట్టి ట్రాక్టర్లను నిలిపివేసిన జమ్మిగూడెం గ్రామస్తులు


అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గురువారం గ్రామస్తులు పట్టుకున్నారు. మండలంలోని జమ్మిగూడెం శివారు చెరువు శిఖం భూముల్లో నుంచి మూడు రోజులుగా జేసీబీతో మట్టి తవ్వి ఏడు ట్రాక్టర్లతో తరలించి విక్రయిస్తున్నారు. దీంతో ఆగ్రహించిన కొందరు గ్రామస్తులు ట్రాక్టర్లను అడ్డుకుని పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో పోలీస్ సిబ్బంది, ఆర్ఐ పద్మావతి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనుమతులు లేవని గుర్తించి ట్రాక్టర్లను తహసీల్‌కు తరలించారు. కాగా, తవ్వకాలు చేసిన జేసీబీతోపాటు మరో మూడు ట్రాక్టర్లను మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తులు తప్పించడం గమనార్హం. ట్రాక్టర్లను అడ్డుకున్న వారిలో స్థానికులు మిద్దిన కొండయ్య, మిద్దిన రాములు, సింగలూరి కృష్ణ, దానపు సింగయ్య, లక్కదాసు శ్రీను, రెడ్డి లక్ష్మి, దానపు జయమ్మ ఉన్నారు.

## గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

టేకులపల్లి: నకిలీ మద్యం తయారీ, రవాణా, ఫేక్ అటెండెన్స్, విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించిన కోయగూడెం కార్యదర్శి, తడికలపూడి గ్రామపంచాయతీల కార్యదర్శి ఓర్సు గోపాలకృష్ణనుఅధికారులు ఈ నెల 4న సస్పెండ్ చేశారు. ఈ విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. గోపాలకృష్ణ గత నెల 18 నుంచి విధులకు హాజరు కావడంలేదు. తన పిల్లలకు డెంగ్యూ జ్వరం వచ్చిందని, విధులకు రాలేనని 20న ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 42 మంది కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్ వేసుకోగా, అందులో ఇతను కూడా ఉన్నారు. 21 రోజులపాటు ఫేక్ అటెండెన్స్ వేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. మిషన్ భగీరథతోపాటు రోడ్లు, కాలువల నిర్మాణాల కాంట్రాక్ట్ పనులు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. గత నెల 21న మహబూబాబాద్ జిల్లాలో నకిలీ మద్యం తయారీ, రవాణా కేసులో అరెస్టయ్యాడు. ఈ నేపథ్యంలో కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఈనెల 4న ఉత్తర్వులు జారీ చేయగా, ఈ విషయాన్ని మండల అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

# కిన్నెరసాని రెండు గేట్లు ఎత్తివేత

**గోదావరిలోకి 10వేల క్యూసెక్కుల నీరు విడుదల**



కిన్నెరసాని నుంచి విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్ : ఎగువన కురుస్తున్న వర్షానికి కిన్నెరసాని జలాశయానికి వరద ఉధృతి పెరిగింది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 8వేల క్యూసెక్కుల వరద నీరు రావడంతో గురువారం నాటికి నీటిమట్టం 405.80 అడుగులకు పెరిగింది. దీంతో రాత్రి వేళ రెండు గేట్లు ఎత్తి 10వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు.

## విద్యుత్ సిబ్బంది సాహసం

మద్దుకూరు సాగునీటి ప్రాజెక్టులో మరమ్మతులు



ప్రాజెక్ట్‌లో మరమ్మతు పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

చండ్రుగొండ: మండలంలోని మద్దుకూరు సాగునీటి ప్రాజెక్ట్‌లో నుంచి వెళ్లే విద్యుత్‌లైన్ పిడుగుపాటుకు మరమ్మతులకు గురికాగా, గురువారం విద్యుత్ సిబ్బంది నీటిలోనే మరమ్మతులు పూర్తి చేశారు. మద్దుకూరు ప్రాజెక్ట్ మీదుగా మద్దుకూరులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి చండ్రుగొండలోని 33/11 సబ్‌స్టేషన్‌కు స్టాండ్‌బై విద్యుత్ లైన్ ఉంది. బుధవారం పిడుగుపాటుకు ప్రాజెక్ట్ మధ్యలో విద్యుత్‌లైన్ ఇన్సులేటర్ తెగిపోయింది. దీంతో రెండు సబ్‌స్టేషన్ల మధ్య విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో సిబ్బంది దాదాపు 10 అడుగుల లోతులో నీటిలో ప్రయాణించి, తాడు మోకుల ద్వారా స్తంభం వద్దకు చేరుకుని మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో పలువురు విద్యుత్ సిబ్బందిని అభినందించారు.

## పోలీసు అదుపులో గంజాయి విక్రేతలు?

ఐదుగురు అనుమానితులను దమ్మపేటలో విచారిస్తున్న పోలీసులు!

అశ్వారావుపేట: మండలంలోని ఆసుపాక గ్రామం గంజాయి రవాణాకు హబ్‌గా మారిందని ప్రచారం సాగుతోంది. దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో సీఐ పింగళి నాగరాజు రెడ్డి ఆసుపాకకు చెందిన కొందరు వ్యక్తులను మూడు రోజులుగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆసుపాకకు చెందిన ఓ వ్యక్తి 20 ఏళ్ల క్రితం భద్రాచలంలో గుమస్తాగా పని చేసేందుకు వెళ్లాడు. అక్కడ ఏర్పడ్డ పరిచయాలతో గుట్కా, ఖైనీ, గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే గంజాయిని ఆసుపాకలో డంప్ చేసి ఇతర ప్రాంతాలకు వేరే వ్యక్తుల ద్వారా చేరవేసేవాడని తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో అశ్వారావుపేట పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. గురువారం అశ్వారావుపేట మండలం నారాయణపురం గ్రామంలో ఓ కారును స్వాధీనం చేసుకుని, ఇతర రాష్ట్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ నాగరాజు రెడ్డిని సంప్రదించగా.. ప్రచారం వాస్తవం కాదని తెలిపారు.

## ప్రహరీని ఢీకొట్టిన ట్రాక్టర్

గోడ కూలి వృద్ధురాలి మృతి

దమ్మపేట: ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రహరీ కూలి మీద పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని లచ్చాపురం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లచ్చాపురం గ్రామానికి చెందిన అబ్బిశెట్టి నారాయణమ్మ(65) తన ఇంట్లో లోపలవైపు ప్రహరీకి ఆనుకుని కూర్చుంది. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలంలోని దిబ్బగూడెం గ్రామానికి చెందిన యువకుడు రావుల సాయి ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా నడుపుతూ నారాయణమ్మ ఇంటి ప్రహరీని ఢీకొట్టాడు. దీంతో గోడ కూలి పడి ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

మణుగూరు టౌన్: తోగ్గూడెం ఆలయ సమీపంలోని సమ్మక్క–సారక్క ఫంక్షన్ హాల్‌లో గురువారం కొందరు పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేశారు. పేకాటరాయుళ్ల వట్ట రాంబాబు, చనుమోలు పూర్ణచంద్రరావు, నంబూరి శ్రీనివాసరావు, చావ సత్యనారాయణ, తాతా రమణ, శ్రీరామోజు అనంతరాములు, గుడే వెంకట్రావు, వెల్లంకి కిశోర్, గద్దం మల్లికార్జునరావు, తోటకూర వెంకటేశ్వరరావు, బట్ట మేకల చంద్రశేఖర్, మాదినేని రాధాకృష్ణ, అడపా వెంకటేశ్వర్లు, కాసబోయిన శ్రీను, ఆరే నవీన్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నాగబాబు తెలిపారు. రూ.1.69 లక్షల నగదు, 15 సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

## ఏడు కిలోల గంజాయి సీజ్

భద్రాచలంఅర్బన్: ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న ఏడు కిలోల గంజాయిని భద్రాచలం పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మోతుగూడెం ప్రాంతం నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా తనిఖీలు చేపట్టిన పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.